క్లుప్తంగా

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్న నోచర్ల శ్రీనువాసరావు తదితరులు

ఉంగుటూరు: పీఎం ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ కనెక్షన్ల పథకంలో దరఖాస్తు చేసుకున్న 150 మందికి బుధవారం చేబ్రోల్లోని ఎస్ఎస్ ఇండియన్ గ్రామీణ మిత్రక్ భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నోచర్ల శ్రీనువాసరావు మాట్లాడుతూ ఇప్పటి వరకూ 620 మంది ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ కనెక్షన్ పథకానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారిలో ఇప్పటి వరకూ 150 మంది దరఖాస్తుదారులకు కనెక్షన్లు అందించామన్నారు. మిగిలిన వారికీ ప్రాధాన్యత ప్రకారం ఉచిత గ్యాస్ కనెక్షన్స్ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా 150 మందికి ఉచితంగా గ్యాస్ స్టౌవ్, గ్యాస్ బండ, రెగ్యులేటర్లు నిర్వాహకులు పంపిణీ చేసారు. తెల్లకార్డు ఉండి గ్యాస్‌కనెక్షన్ లేని ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. గ్యాస్ కనెక్షన్ ఉచిత రిజిస్ట్రేషన్ కోసం చేబ్రోల్ ఎస్ఎస్ ఇండియన్ గ్యాస్ వద్ద లేదా ఫోన్ నంబర్ 99899 88499 సంప్రదించాలని ఆ సంస్థ మేనేజర్ నోచర్ల బాలకిరణ్ తెలిపారు.

ఏసుక్రీస్తు మార్గంలో నడవాలి



పెదవేగిలో దైవ సేవకుల సదస్సులో మాట్లాడుతున్న పాస్టర్ జెర్మియా

పెదవేగి : ప్రతి వ్యక్తికీ ఏసు క్రీస్తు దీవెనలు మెండుగా ఉండాలని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. పెదవేగిలోని రాపాక రాజు ఆవరణలోని లవ్ అండ్ హోప్ దేవాలయంలో దైవ సేవకుల సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎంపీపీ పాస్టర్లను ఉద్దేశించి మాట్లాడుతూ దేవుని ఆజ్ఞలను అనుసరించి, ఆయన మాట ప్రకారం ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు అడుగుజాడలో పయనించాలని ఆమె అన్నారు. అనంతరం పాస్టర్లు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయాలని కోరుతూ ఎంపీపీకి వినతిపత్రం అందించారు. దీనిపై ఎంపీపీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మండలం పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చొప్పెల్లి నాగరాజు, పాస్టర్లు విజయ్‌కుమార్, మిలాంగ్ టన్, జోసెఫ్, ప్రకాశరావు, సుభాకర్, సుమన్, యాకోబు పాల్గొన్నారు.

17 క్యాంపుల్లో 7,985 మందికి వైద్య సేవలు

దెందులూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో దెందులూరు మండలంలో నిర్వహించిన 17 వైద్య శిబిరాల్లో 7,985 మందికి వైద్య సేవలందించినట్టు దెందులూరు మండల ప్రత్యేక అధికారి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీసర్ కృపావరం అన్నారు. బుధవారం దెందులూరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పూర్తి సహాయ సహకారాలతో దెందులూరు సీహెచ్‌సీ, పోతునూరు, గోపన్నపాలెం పీహెచ్‌సీల వైద్య బృందం 17 వైద్య శిబిరాల్లో 8 విభాగాల్లో 7,985 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారని తెలిపారు. ఈశిబిరాల నిర్వహణలో విజయవంతం కావడానికి కారకులైన ప్రతి ఒక్కరికీ మండల ప్రత్యేక అధికారి కృపావరం, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ లక్ష్మి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస చౌదరి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు



గుండుగొలనులో బతుకమ్మ సంబరంలో పాల్గొన్న మహిళలు

భీమడోలు: విజయదశమి ఉత్సవాల్లో భాగంగా గుండుగొలనులోని కనకదుర్గాదేవికి 11 రోజుల పాటు తెలంగాణ తరహాలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిసాయి. గ్రామంలోని చల్లా వారి వీధిలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల వద్ద తొలి ఏడాది బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రధాన కూడళ్లలో తెలుగింటి ఆడపడుచులు, ఆడ పిల్లలు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ప్రసాదాలను, బోనాలుగా అమ్మవారికి సమర్పించారు. వారంతా బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ కోలాట నృత్య ప్రదర్శనలు చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. 11 రోజులపాటు ఆయా ప్రాంతాల్లో వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రతి రోజు నైవేద్యాలను సమర్పించారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో మెరుగైన ఉచిత వైద్య సేవలు
- జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ



పెదపాడు: వడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మహిళకు వైద్య పరీక్షల రిపోర్టులు అందజేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ



ఉంగుటూరు: నారాయణపురంలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు



భీమడోలు: ఎంఎంపురంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

పెదపాడు: పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని వడ్డిగూడెంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. వైద్య పరీక్షలు అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేసారు. ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల ప్రజల ఆరోగ్యం మెరుగుపర్చేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని, దీనిని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. వైద్యులు డాక్టరు పాల్, డాక్టరు చక్రధర్‌తో పాటు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సర్పంచ్ మరడాని చంటి, ఎంపీటీసీ పూడి అప్పలస్వామి, గుణుపూరు మహేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు అనూహ్య స్పందన

పెదవేగి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. బుధవారం పెదవేగి మండలంలోని నడిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మేకా అప్పాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ శిబిరంలో వైద్య సేవలను అందించడంతోపాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీ ఆర్ మనోజ్, సర్పంచ్ మేక అప్పాయమ్మ, ఆర్ఐ రామకృష్ణ, ఎంఈఓ2 అరుణ్ కుమార్, కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలందరికీ వరం

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలందరికీ వరమని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కామిరెడ్డి నాని, విజయవాడ కనకదుర్గమ్మతల్లి ఆలయ ట్రస్టు బోర్డు డైరక్టర్ తొత్తడి వేదకుమారి అన్నారు. బుధవారం దెందులూరు సచివాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, ఎంపీటీసీలు తోట విజయ కుమారి, తాళ్లూరి నాగరాజు, పులిపాటి ఆనంద్, సొసైటీ చైర్మన్ పాలుసు గణపతిరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. దెందులూరు, అలుగుల గూడెం, సత్యనారాయణపురం, అప్పారావుపాలెం, ప్రాంతాల నుంచి వచ్చిన 495 మందికి 8 విభాగాల్లో వైద్య బృందం వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు, కిట్లు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సంయుక్తంగా బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన సంపూర్ణ పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ నిట్టా నీలా నవకాంతం, కామిరెడ్డి నాని, డైరక్టర్ తొత్తడి వేదకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కృపావరం, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ లక్ష్మి, ఈఓఆర్‌డీ స్వామి, కార్యదర్శి శ్రీనివాసచౌదరి, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలోని సచివాలయం– 3 వద్ద ముగింపు రోజైన బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి పరిసర గ్రామాలకు చెందిన రోగులు, వృద్ధులు, చిన్నారులు 450 మందిపైగా తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. తొలుత ఈ శిబిరాన్ని సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ ప్రారంభించారు. వైద్యులు బి.లీలా ప్రసాద్, గైనిక్, పిల్లల వైద్య ప్రత్యేక నిపుణులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసారు. 70 మందికి కంటి పరీక్షలు చేసారు. ఈ శిబిరాన్ని తహసీల్దార్ సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ సందర్శించి పలు సూచనలందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పుప్పాల గోవర్ధన రామానుజం, ఎంపీహెచ్‌ఈవో కిషోర్, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

గణపవరం: ఆరోగ్య సురక్ష పథకం ద్వారా అందరికీ మంచి ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గణపవరం ఎంపీడీవో జ్యోతిర్మయి అన్నారు. బుధవారం గణపవరం మండలం కొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ మద్దాల రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యుడు మద్దాల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో సర్పంచ్ రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వెంకటేశ్వరరావు ఈ వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. వైద్యనిపుణులు 100 రోగులకు పరీక్షలు నిర్వహించిన ఉచితంగా మందులు అందజేశారు. 30 మందికి కంటిపరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దాల మధు, మండల సచివాలయ కన్వీనర్ ఎంఆర్‌కే పాల్గొన్నారు.

నారాయణపురంలో వైద్య శిబిరం

ఉంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఉంగుటూరు ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి అన్నారు. నారాయణపురం సచివాలయం–1 పరిధిలో ప్రాథమిక పాఠశాల--1లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ వైద్య నిపుణులను తీసుకువచ్చి వైద్య శిబిరంలో సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అడపా శ్రీనివాస ప్రభు, ఎంపీటీసీల ఛాంబర్ మండలాధ్యక్షుడు బండారు నాగరాజు, ఎంపీటీసీ ఆరవెల్లి మహాలక్ష్మి దానయ్య, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, నాయకులు బల్ల త్రిమూర్తులు, మతుకుమిల్లి శ్రీధర్, ఎన్.గంగాధర్, లావేటి వీరాచారి విజయ్, ఎంపీడీవో ప్రేమాన్విత, డిప్యూటీ తహసీల్దార్ బొడ్డేపల్లి ప్రసాద్, వైసీపీ జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షులు పుప్పాలగోపి, ఎంఈవో కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ వైద్యశిబిరంలో జనరల్ సర్జన్ డాక్టర్ కె.శివశంకర్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ శ్రావణ్‌రెడ్డి, డాక్టర్ అనూషలు వైద్యసేవలు అందించారు. 467 మంది ప్రజలు ఈ వైద్యశిబిరంలో వైద్య సేవలు పొందారు.



దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది



గణపవరం: కొత్తపల్లిలో గుండె ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది



పెదవేగి : మందుల కిట్ అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్, ఇతర అధికారులు

వైభవంగా అమ్మవార్ల గ్రామోత్సవం



గణపవరం: కనకదుర్గమ్మ విగ్రహ ఊరేగింపు



భీమడోలు: సూరప్పగూడెంలో గౌరమ్మ తల్లి ప్రతిమలతో ఊరేగుతున్న మహిళలు



దెందులూరు: సీతంపేటలో అమ్మవారి ఊరేగింపు



పెదపాడు: వడ్డిగూడెంలో అమ్మవారి గ్రామోత్సవం

గణపవరం: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా కనకదుర్గ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం గణపవరం, సరిపల్లె, పిప్పర, మొయ్యేరు, చిలకంపాడు, కాశిపాడు, అర్ధవరం, కొమ్మర తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనాలపై ఉంచి బ్యాండుమేళాలు, డీజే సౌండ్స్, గరగల నృత్యాలు, బుట్టబొమ్మలు, కోయ డ్యాన్సులతో ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించి పూజలు చేశారు. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు.

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం

భీమడోలు: శరన్నవరాత్రుల సందర్భంగా సూరప్పగూడెంలో మహిళలు గౌరమ్మ ప్రతిష్ఠించి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠించిన గౌరమ్మను ముగింపు రోజైన బుధవారం మహిళలు నిమజ్జనం చేసారు. ముందుగా గౌరమ్మ అమ్మవారి ప్రతిమలను మహిళలు తమ నెత్తిన పెట్టుకుని గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేసారు. మేళతాళాల నడుమ అమ్మవారిని ఊరేగిస్తూ మహిళలు గోదావరి కాల్వలో నిమజ్జనం చేసారు.

పూర్ణాహుతి హోమం

దెందులూరు: గోపన్నపాలెంలోని కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం పూర్ణాహుతి హోమం నిర్వహించారు. గ్రంథి ప్రభాకర్, కొండేటి హనుమంతు, తోట అచ్చారావు, బట్టు రాంబాబు దంపతులు అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ పూర్ణాహుతి హోమం నిర్వహించారు.

అమ్మవారి ఊరేగింపు

దెందులూరు: సీతంపేటలో అమ్మవారిని విశేషంగా అలంకరించి సచివాలయం నుంచి గ్రామంలో అన్ని పురవీధుల్లో బుధవారం ఊరేగింపు నిర్వహించారు. గోపన్నపాలెంలో నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో భాగంగా కోలాటంలో అత్యుత్తమ ప్రదర్శన చేసి తమ ప్రతిభను చాటుకున్న బృందాన్ని కనకదుర్గమ్మతల్లి ఆలయ ఉత్సవ కమిటీ కొండేటి హనుమంతు కమిటీ సభ్యులు సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరికుమార్ ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. సీతంపేట, గోపన్నపాలెం ఆలయాల్లో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వడ్డిగూడెం, నాయుడుగూడెంలో..



పెదపాడు: నాయుడుగూడెం అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొన్న జెడ్పీచైర్మన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు

పెదపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో కనకదుర్గమ్మ అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మండలంలోని వడ్డిగూడెంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు తినాతి విజయ్ నేతృత్వంలో వడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని బుధవారం ఉదయం గ్రామోత్సవం నిర్వహించారు. భవానీ మాలధారులు పాల్గొన్నారు. నాయుడుగూడెం గ్రామ శివారు కేవీకే పురంలో ఏర్పాటు చేసిన అమ్మవారి గ్రామోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ గ్రామోత్సవాన్ని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీతోపాటు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుప్పాల ఆదినారాయణ, అన్నెపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్వా ఉత్పత్తులను ప్రోత్సహించేందుకే 'ఫిష్ ఆంధ్ర'

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- నిడమర్రులో అవుట్ లెట్ ప్రారంభం



నిడమర్రులో ఫిష్ ఆంధ్ర అవుట్ లెట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తులను ప్రోత్సహించడంతో పాటు, యువతకు ఉపాధి అవకాశం కల్పించేందుకే రాష్ట్రంతోపాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో ఫిష్ ఆంధ్ర అవుట్ లెట్లు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం నిడమర్రు పందికోడు వంతెన వద్ద ప్రభుత్వ సబ్సిడీతో ఏర్పాటు చేసిన 'ఫిష్ ఆంధ్ర' అవుట్ లెట్‌ను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ నాణ్యమైన చేపలు, రొయ్యలు వంటి ఆక్వా ఉత్పత్తులను తక్కువ ధరలకే అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ ఫిష్ ఆంధ్ర అవుట్ లెట్స్‌ను పట్టణ ప్రాంతాలతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే మత్స్య ఉత్పత్తుల్లో మన రాష్ట్రం వాటా 40 శాతం ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు. ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని పెంచడంతోపాటు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పరిశుభ్రత, నాణ్యమైన చేపలను తక్కువ ధరలకే ఈ అవుట్‌లెట్ల ద్వారా అందించేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, సర్పంచ్ పాట్నూరి ఉమా మహేశ్వరరావు, మండల ఆర్‌బీకే చైర్మన్ పోలిశెట్టి రమేష్ ఆర్‌బీకే చైర్మన్ మండా పోలయ్య, ఎంపీటీసీ దూసనపూడి సత్యనారాయణ, అంబళ్ల శ్రీను, తలమంటి వెంకటేశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు గుడెసే జాన్, పెద్దిరెడ్డి సత్యనారాయణ, కన్నాజి బాలాజీ తదితరులున్నారు.

9,11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి : జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో దరఖాస్తుల ఆహ్వానం కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు ఆఖరు తేదీ ఈనెల 31 వరకు సమయం ఉందని, అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు 9, 11వ తరగతి సంబంధించి ప్రవేశ పరీక్షకు గడువు లోపల దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై చంద్రశేఖర్ చెప్పారు.

అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీ

పెదపాడు: పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పెదపాడు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ కే విజయలక్ష్మి తెలిపారు.

సహాయకుల ఖాళీలు

పెదపాడు మండలంలోని అప్పనవీడు–2 ఓపెన్, పెదవేగి మండలంలోని దుగ్గిరాల–2 ఓపెన్, భోగాపురం–1 ఓపెన్, దెందులూరు మండలంలోని శ్రీరామవరం–2 ఎస్సీ, వేగవరం బీసీ–ఎ, దెందులూరు–1 ఓపెన్, పోతునూరు–1, పీహెచ్ ఆర్థో కేటగిరికీ కేటాయించినట్లు చెప్పారు. పెదవేగి మండలంలోని అంజలీపురంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఎస్సీ, కేటగిరికి కేటాయించినట్లు చెప్పారు. ఈ ఉద్యోగాలకు 21 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు 10వ తరగతి పాసైన స్థానికులైన వివాహిత మహిళలు అర్హులని చెప్పారు.గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన విద్యార్హతల కాపీలను దరఖాస్తుకు జతచేసి నవంబరు 1 సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో 5 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయా పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భీమడోలు సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. ఆయా పోస్టుకు ఆ గ్రామానికి చెందిన మహిళ 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండి , 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఉంగుటూరు 183 కేంద్రం (శివాలయం వద్ద) అంగన్‌వాడీ కేంద్రం, కైకరం 250 సచివాలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి, వెంకటకృష్ణాపురంలో అంగన్‌వాడీ కేంద్రానికి, తిమ్మయ్యపాలెం, సీతారామపురం అంగన్‌వాడీ కేంద్రాల ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. నంబర్ 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు: భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 9 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని భీమడోలు ఐసీడీఎస్ పీవో కేవీఎఎస్ విజయలక్ష్మి అన్నారు. భీమడోలులో బుధవారం ఆమె తెలిపారు. భీమడోలు ప్రాజెక్టు పరిధిలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాల పరిధిలోని 9 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టుల భర్తీకి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉంగుటూరు మండలంలోని తిమ్మయ్యపాలెం బీసీబీ కేటగిరికి, ఉంగుటూరులో ఎస్సీ కేటగిరికి, వీకేపురం ఓసీ కేటగిరికి ,కైకరంలో ఓసీ దివ్యాంగురాలికి, సీతారామపురం ఓసీ కేటగిరికి, భీమడోలు మండలంలోని దుద్దేపూడి బీసీఏ కేటగిరికి, నిడమర్రు మండలంలోని పెదనింద్రకొలను ఓసీ కేటగిరికి, తోకలపల్లి 3 పరిధిలో బీసీఈ కేటగిరికి, బావాయిపాలెం 3 పరిధిలో ఓసీ కేటగిరికి కేటాయించామన్నారు. స్థానికులైన వివాహిత మహిళలకు అర్హులని, పదో తరగతి పాసై ఉండాలన్నారు. తక్కువ అంగవైకల్యం కలిగిన వారు అర్హులన్నారు. ఈనెల ఏడాది జూలై 1వ తేదీ నాటికి 21 ఏళ్ల నిండి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. నవంబర్ ఒకటవ తేదీ లోగా భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి సమర్పించాలని ఆమె కోరారు.

విజేతలకు బహుమతి ప్రదానం

భీమడోలు: ప్రతి ఒక్కరూ ఎదగాలంటే పుస్తకమే ఆయుధమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల నేపథ్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన బాలబాలికలకు భీమడోలు జంక్షన్‌లోని శారదాదేవి శరన్నవరాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎం.గోవిందరెడ్డి హాజరయ్యారు. భీమడోలు బస్టాండ్ స్థల దాత పుల్లాబొట్ల బాలకృష్ణ కుటుంబ సభ్యులను ఉత్సవ కమిటీ నిర్వాహకులు దుశ్శాలువాలను కప్పి జ్ఞాపికలను అందించి సత్కరించారు. గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన చిన్నారులకు జ్ఞాపికలను అందించారు. ఉత్సవ కమిటీ సభ్యులకు జ్ఞాపికలను అందించారు. అనంతరం లడ్డూ పాట నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎం.గోవిందరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటరమణ, నిర్వాహకులు కాపల్లి హరినాథ్ రాజు, మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాకిన సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి నాగిరెడ్డి, పెద్దలు లక్ష్మీ, సవలం రత్తయ్య, షేక్ హజారత్, డి.దుర్గ, కమిటీ సభ్యులు, గ్రంథపాలకుడు కె.శ్రీనివాసరావు, బాలబాలికలు పాల్గొన్నారు.